RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 284 | బుధవారం, మార్చి 25 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ. | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని

# బిఆర్ఎస్

ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు

విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా

మహిళలను కోటీశ్వరులను చేయాలనుకోవడం తప్పా

బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా

బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు

గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా

బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బిఆర్ఎస్‌పై భట్టి చురకలు



**హైదరాబాద్,మార్చి 24 :** బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం మిగతా2లో...



## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్

నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి

తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన

నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు

**జగిత్యాల,మార్చి 24 :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ ఉద్దండుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానంపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమా ర్‌ను పార్టీలోకి చేర్చుకోవడం, ఆ తర్వాత జిల్లాలో తనకు ప్రాధా న్యత తగ్గడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25న పార్టీకి రాజీనామా చేస్తానని మిగతా2లో...



## సీఎం చంద్రబాబుతో

# సంజయ్ దత్ భేటీ

### - అమరావతిలో ఫిలిం సిటీ వ్యవహారాలపై చర్చ

**అమరావతి, 24 :** అమరా వతిలో త్వరలోనే ఏపీలో భారీ సినీ స్టూడి యోలు లేదా అంతర్జాతీయ స్థాయి ఫిలిం సిటీ నిర్మా ణంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపి స్తోంది. మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సంజయ్ దత్ బృందం నేరుగా వెలగ పూడిలోని సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. గత ఫిబ్రవరిలో ముంబై వేదికగా మంత్రి లోకేశ్‌తో జరిగిన చర్చల కొనసాగింపు గానే ఈ పర్యటన సాగుతున్నట్లు తెలుస్తోంది. సంజయ్ దత్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన ముగ్గురు కీలక ప్రముఖులు మిగతా2లో...

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు

### - ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్




# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు

క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు

హిందువుల,సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు

ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,మార్చి 24 :** మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తర వాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు మిగతా2లో...





## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

### - మండిపడ్డ విపక్ష నేత రాహుల్

**న్యూఢిల్లీ,మార్చి 24 :** పశ్చిమాసియా ఉద్రి క్తతలను గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ పరిస్థితి కోవిడ్ తరహాలా మిగతా2లో...

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది

దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా

ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,మార్చి 24 :** దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నాయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు మిగతా2లో...

## నా... మాట!

ఇవి నీళ్లు నమిలే రోజులు కావు తమ్మీ!
తొడకొట్టి బ్రతకడం నేర్చుకో,
నిజాన్ని నిర్భయంగా చెప్పడం అలవాటు చేసుకో!
అన్యాయాన్ని ప్రశ్నించడం మొదలు పెట్టు..
ఏవరికో భయపడి వెయ్యిండ్లు బతుకుమీద
ఆశ పెట్టుకోకు..
అందరం ఏదోరోజు పోయేటోళ్ళమే,
కాకపోతే కొంచం వెనుక ముందు..
చరిత్రలో నువ్వుండడం కాదు,
నీకే ఓ చరిత్ర ఉండాలి..
గడిచిన కాలం మళ్ళీ తిరిగిరాదు,
క్షణం తీరిక లేకుండా గడపడం నేర్చుకో!
పదిమందికి మేలు చేయకున్నా పర్వాలేదు,కానీ!ఏ
మనిషికి కీడుతలపెట్టే పని చేపట్టకు.
నీకు నచ్చినట్టు బ్రతకడం నేర్చుకో...
ఏవరికో సమాధానం,చెప్పే పని ఎప్పుడు చేయకు!
నీకు జన్మనిచ్చిన నేలకోసం ఏదైనా మంచి పనిచేసి
ఋణం తిర్చుకో!
నీగురించి ఈ సమాజం గొప్పగా చెప్పుకోవాలి,
నీ తల్లిదండ్రులు మురిసిపోవాలి..
నీ మరణాన్ని చూసి స్మశానమే కన్నీళ్లు పెట్టాలి..
మనిషిగా.... బ్రతికే నీ జీవితం ఏంతోమందికి
ఆదర్శం కావాలి..

పెద్దపల్లి రాజన్న... : 9848174314

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

● మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక ● ఢిల్లీ మెట్రో, అసెంబ్లీ లకు బాంబు బెదిరింపులు




విలేకరులు కావలెను

తెలుగు భాషపై పట్టు, స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన యువతీ యువకులకు

జర్నలిస్టుగా పనిచేసేందుకు గొప్ప సదవకాశం

హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

నూతన ఒరవడి, సంచలన కథనాలతో మీ ముందుకు దూసుకొస్తున్న "హైదరాబాద్ ఎస్టేట్ దినపత్రిక" కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు డివిజన్ల స్థాయిల్లో పనిచేయుటకు ఇన్ ఛార్జీలు, విలేకరులు కాలెను

hyderabadestatetelugudaily999@gmail.com

Cell : 9951693876, 9848456534 ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు.

# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయ ండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవా ల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గ్దదెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బ్జడెట్ సెషన్‌లో అడుగు తాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్సన్ ఇస్తున్నరు. మీరు గ్దదెనెక్కిన తర్వాత మూడో బ్జడెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయి ంచడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యా ంగ సోదర సోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలి పెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం.

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

(మొదటి పేజీ తరువాయి)

కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

**న్యూఢిల్లీ,మార్చి 24 :** దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొం టూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయి తే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయ పడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.



# లొంగిపోయిన మావోయిస్ట్ నేత పాపారావు

**బీజాపూర్,మార్చి 24 :** మావోయిస్టు అగ్రనేత పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 17 మంది అనుచరులతో బీజాపూర్ ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. లొంగిపోయిన వారిలో 10 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నారు. వారి నుంచి భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతానికి చెందిన పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. అతడిపై 50 కేసులు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ అపహరణ ఉదంతంలో పాపారావు కీలక పాత్ర పోషించాడు. 76 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలోనూ ఇతడి హస్తం ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

# ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్టేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సమీక్షా సమావేశం లో ప్రభుత్వం ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు , హైర్ లేదా డిపా÷-టం÷-మెంట్ లు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలెక్టిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి..క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిటైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్ ,ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాపేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం.. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్టేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.

# సిఎం చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ భేటీలో పాల్గొన్నారు. గౌరవ్ దూబే , కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వీరిలో ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఒక భారీ ఫిలిం సిటీ లేదా సినిమా హబ్ అవసరం ఎంతైనా ఉంది. గతంలో లోకేశ్‌తో జరిగిన భేటీలో సంజయ్ దత్ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఈ ఫిలిం సిటీని అమరావతి పరిసరాల్లో లేదా విశాఖపట్నంలో ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. సినిమా షూటింగ్‌ల కోసం ఏపీని ఒక గమ్యస్థానంగా మార్చడానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, మౌలిక సదుపాయాలపై సీఎం చంద్రబాబు సంజయ్ దత్ బృందానికి వివరించినట్లు తెలుస్తోంది. ఏపీలో సినిమా ఇండస్ట్రీకి అవసరమైన లొకేషన్లు పుష్కలంగా ఉన్నాయి. సంజయ్ దత్ వంటి అగ్ర నటులు ఇక్కడ స్టూడియోలు లేదా ఫిలిం సిటీలను నిర్మిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. బాలీవుడ్, సౌత్ సినిమాల కలయికతో ఏపీ సినీ హబ్‌గా మారుతుందని ప్రబుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**న్యూఢిల్లీ,మార్చి 24 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరంతో పాటు పశ్చిమాసియాలో పరిస్థితిపై ఉభయులూ చర్చించారు' అని సెర్గియో గోర్ ఆ ప్రకటనలో తెలిపారు. రాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేశారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో జరుపుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే అమెరికాతో చర్చలను ఇరాన్ కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోనులో సంభాషించినట్టు ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన చర్చ జరిగిందన్నారు. వీలైనంత త్వరలో ఉద్రికతలు తొలగేందుకు, శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు ఉంటుందని తాను స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి తెరవడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులోకి తేవడం యావత్ ప్రపంచానికి అవసరమని పేర్కొన్నారు.

# కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ఉందంటూ పేర్కొనడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపాయారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు వెలుపల మీడియాతో రాహుల్ మంగళవారంనాడు మాట్లాడారు. 'పార్లమెంటులో ఆయన నిన్న సందర్భోచితం కాని మాటలు మాట్లాడారు. కరోనా మహమ్మారితో ప్రస్తుత సందర్భాన్ని పోల్చారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో ఇప్పుడే పెరుగుదల మొదలైంది. ఇంతలోనే పరిస్థితిని కరోనా మహమ్మారి రోజులతో ఆయన పోలుస్తున్నారు. కరోనా విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయినట్టున్నారు' అని రాహుల్ అన్నారు. దేశ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, దేశ విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని, అంతర్జాతీయంగా ఇదొక హాస్యాస్పద అంశంగా మారిందని అన్నారు. 'మోదీ రాజీపడితే మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్టే కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. మధ్యఆసియాలో పరిణామాలపై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశంపై అడిగినప్పుడు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినా సరిదిద్దుకోలేని నిర్మాణాత్మక తప్పిదం జరిగిందని అన్నారు. అమెరికా ఏది చెబితే అది మోదీ చేస్తారని, రైతులు, దేశ ప్రయోజనాల కోసం పనిచేయరని విమర్శించారు. కేరళలో తనకు ప్రోగ్రాం ఉన్నందున అఖిల పక్ష సమావేశానికి హాజరుకాకపోవచ్చని చెప్పారు.

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

(మొదటి పేజీ తరువాయి)


ఆయన ప్రకటించడంతో, కాంగ్రెస్ అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా పార్టీ కండువా కప్పే ప్రయత్నం చేయగా... "జరిగిన అవమానం చాలు.. ఇక ఈ కండువా వద్దు" అంటూ జీవన్ రెడ్డి సున్నితంగా తిరస్కరించడం అందరినీ షాక్ కు గురిచేసింది. మరోవైపు, జీవన్ రెడ్డికి ఒకప్పుడు అత్యంత సన్నిహితుడిగా ఉండి, ఇప్పుడు ఎమ్మెల్యే సంజయ్‌తో కలిసి తిరుగుతున్న డీసీసీ అధ్యక్షుడు నందయ్యను లోపలికి రానివ్వకుండా జీవన్ రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. దీంతో ఆయన అక్కడి నుంచి వెనుదిరగాల్సి వచ్చింది.

# త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చేలిపారు. ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం



**హైదరాబాద్,మార్చి 24 :**హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో వర్షం పడింది. పలు చోట్ల రహదారులపై భారీగా వరద చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి వంతెనపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మణికొండలో వడగళ్ల వాన కురిసింది. యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణనగర్‌లో రహదారులను వాన నీరు ముంచెత్తింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వాన నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## రాయపోల్ గ్రామంలో మహిళపై దాడి, భర్త, అత్తమామలపై ఆరోపణలు





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:- ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో మహిళపై జరిగిన దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం పెద్ద రావులపల్లి గ్రామానికి చెందిన పారిజాతను కొన్నేళ్ల క్రితం రాయపోల్ గ్రామానికి చెందిన మైలారం కైలాష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహానంతరం కొంతకాలం సజావుగా సాగిన కుటుంబ జీవితం, ఇటీవల వివిధ కారణాల వల్ల కలహాలకు దారి తీసిందని సమాచారం. ఈ క్రమంలోనే భర్తతో పాటు అత్తమామలు కలిసి పారిజాతపై దాడి చేశారని ఆమె కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో గాయపడిన పారిజాతకు సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు తక్షణమే స్పందించి, ఆమెను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. కుటుంబ కలహాలు హింసకు దారి తీస్తుండటం ఆందోళన కలిగించే విషయం అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మహిళలపై హింస ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో బాధితులకు రక్షణ కల్పించేందుకు కఠిన చర్యలు అవసరమని ప్రజలు కోరుతున్నారు.

## ఎన్‌జీఓస్ కాలనీ గ్రంథాలయ పనులకు మళ్లీ శ్రీకారం

### ఎల్ బి నగర్ నియోజకవర్గం శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:-ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీవాసులు గ్రంథాలయ పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పనులను తాను ఎప్పుడూ ఆపలేదని, కొందరు బీజేపీ కార్పొరేటర్ల చర్యల వల్లే ఆలస్యం జరిగిందని తెలిపారు. అక్కడే ఉన్న అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ, రేపటి నుంచే పనులు ప్రారంభించాలని సూచించారు.గ్రంథాలయ నిర్మాణం పునఃప్రారంభం కానుండటంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు ఎమ్మెల్యేను, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ భరసా పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, స్థానిక నాయకులు, యువజన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సంక్షోభంపై అసెంబ్లీ ముట్టడి బీఆర్ఎస్ ఆగ్రహం

### లిలికేంద్ర-రాష్ట్రాల ద్వంద్వ వైఖరిపై బీఆర్ఎస్ గన్‌పార్క్ నిరసన







(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:-రాష్ట్రంలో గ్యాస్ కొరత అంశంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా విమర్శించారు. గ్యాస్ సరఫరా సమస్యపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వాలు నిజాలను దాచిపెట్టి ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు.ఒకవైపు గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు గోడౌన్ల వద్ద ప్రజలు భారీ క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. కేంద్రం సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. అలాగే, రాబోయే రోజుల్లో సిలిండర్ పరిమాణాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారాన్ని ప్రస్తావించారు.ఇరాన్‌లో సమస్యలు ఉన్నా, ఇతర దేశాల నుంచి గ్యాస్ దిగుమతి చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నిరసనకు మద్దతు తెలిపారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై కలెక్టర్ సమీక్ష

**- 99 రోజుల ప్రణాళిక పనుల్లో నిర్లక్ష్యం సహించం: కలెక్టర్ హెచ్చరిక**





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:-రంగారెడ్డి జిల్లా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10 థీములతో అమలు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం, విద్యుత్ మరమ్మత్తులు, భవనాల పునరుద్ధరణ, పెయింటింగ్ వంటి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లు లేకుండా క్లియర్ చేయాలని, ఈ-ఆఫీస్ నిర్వహణను అన్ని శాఖలు చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, జనన--మరణ ధృవపత్రాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. 99 రోజుల ప్రణాళికను నిర్లక్ష్యంగా కాకుండా సమర్థవంతంగా అమలు చేయాలని, నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వేసవి నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పైపు లీకేజీలు నివారించి నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని అధికా రులను ఆదేశించారు. అవసరమైన చోట బోర్లు, హ్యాండ్‌పంపులు మరమ్మతు చేయాలని, మారుమూల ప్రాంతాలను అధికారులు సందర్శించి పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. ఈ సమా వేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్‌లో సీపీఎం భారీ ర్యాలీ




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:-భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా సీపీఎం పార్టీ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురం రెడ్ ట్యాంకు నుండి రైతు బజార్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావుడని కొనియాడారు. చిన్న వయసులోనే విప్లవ ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన త్యాగం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాకు తాకట్టు పెడుతోందని భూపాల్ తీవ్రంగా విమర్శించారు. దేశంలో కుల, మత వివాదాలను రెచ్చగొట్టి రాజకీయ లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఆధిపత్యం పెంచుకుంటూ యుద్ధాలకు ప్రోత్సాహం ఇస్తోందని, ఆర్థిక మరియు చమురు వనరులపై ఆధిపత్యం సాధించేందుకు కుట్రలు పన్నుతోందని తెలిపారు. దేశ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చిన్న వ్యాపారాలు కూడా దెబ్బతింటున్నాయని అన్నారు. రేషన్ కార్డులు, గృహ స్థలాల సమస్యలు ఇంకా పరిష్కారం కాని పరిస్థితిని ప్రస్తావించారు. దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేసినప్పుడే నిజమైన భగత్ సింగ్ వారసుల మవుతామని స్పష్టం చేశారు.ఈ ర్యాలీలో సీపీఎం నాయకులు డి. రాధ, బి. కాశయ్య, పి. రామస్వామి, ఎం. వీరయ్య, రాధమ్మ, పోలే రమేష్, గంగమ్మ, అంజి రాథోడ్, లక్ష్మణ్, లలిత, ఆలేటి సుజాత, దండు అంజమ్మ, సుమన్ నాయక్, సిహెచ్ సైదులు తదితరులతో పాటు మహిళలు సహా సుమారు 600 మంది పాల్గొన్నారు.

# సమస్యలకు చెక్ కొనుగోలుదారు అఫిడవిట్‌తోనే పరిష్కారం

**- జీ.ఓ. 76తో సాదాబైనామాలకు శుభవార్త 9 లక్షల దరఖాస్తులకు త్వరలో క్లియర్**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:-రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి గారు సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకుపైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ-సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెలిపారు. ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

# మున్నూరుకాపులు రాజకీయాలలో రాణించాలి



- తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం (పటేల్స్) యువజన విభాగం రాష్ట్ర
- ప్రధానకార్యదర్శిగా కోపల్లి సత్యనారాయణ పటేల్ నియామకం
- తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం (పటేల్స్) అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య

హైదరాబాద్, మార్చి 24: మున్నూరుకాపులు సామాజిక సేవా కార్యక్రమాలు, వ్యవసాయం, వ్యాపార రంగానికే పరిమితం కాకుండా రాజకీయాలలో రాణించేందుకు ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం (పటేల్స్) అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్ పుర లోని సంఘం కార్యాలయంలో సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోపల్లి సత్యనారాయణ పటేల్ ను నియమిస్తూ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాజ్ కుమార్ తో కలిసి ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంఘాన్ని అభివృద్ధి పరుస్తూనే ప్రజా సేవలో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన మున్నూరుకాపుల అందరికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. రాజకీయాలను శాసించే స్థాయికి మున్నూరుకాపులు ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబాటుతనానికి గురవుతున్న మున్నూరుకాపుల అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపులంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## తొర్రూర్‌లో దేవాలయ అభివృద్ధికి కొత్త దిశ రాజీవ్ గృహకల్పలో కమిటీ ఏర్పాటు



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:-తొర్రూర్, మార్చి 24: పట్టణంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో దేవాలయ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. కాలనీలోని దేవాలయానికి సోమవారం కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కమిటీ నియామకాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు ఆలయ నిర్వహణను పారదర్శకంగా కొనసాగించడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు వెల్లడించారు.కాలనీ వాసులు కూడా తమ వంతు సహకారం అందిస్తూ దేవాలయాన్ని మరింత అభివృద్ధి పరచాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది.

## మామూళ్లు మరిగిన వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్




ఖమ్మం :ప్రసాద్ ను అరెస్ట్ అరెస్టు చేసిన ఏసీబీ డిఎస్పి వై.రమేష్ ఈరోజు ఒక కాంట్రాక్టర్ నుండి రూ 24 లంచం డిమాండ్ చేసి మంగళవారం తీసుకుంటు ఉండగా వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ ను ఏసీబీ డిఎస్పి వై.రమేష్ అరెస్ట్ అరెస్టు చేశారు.
ఏసీబీ డీఎస్పీ వైరమేష్ ఆధ్వర్యంలో వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వి. ప్రసాద్ అతని ప్రైవేట్ అసిస్టెంట్ ను అరెస్టు చేశారు.ఒక కాంట్రాక్టర్ పెనుబల్లి నుండి ఖమ్మం కు ఇటుక తోలుకునేందుకు నాలుగు డాక్టర్లు ఐదు టిప్పర్లకు గాను నెలకు 24,800 ఇవ్వాలని డిమాండ్ చేయడంతో సదర్ కాంట్రాక్టర్ ఏసీబీ ని ఆశ్రయించాడు. ఈ లంచం మంగళవారం ఖమ్మం ఆర్టీవో ఆఫీస్ లో తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు దాడి చేశారు . ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసిబి డిఎస్పి వైరమేష్ ఆధ్వర్యంలో దాడి చేసి అతన్ని అతని అసిస్టెంట్ ను అరెస్ట్ చేశారు ఒక టిప్పర్ కు నెలకు 3200,ఒక ట్రాక్టర్ కు 2200 చొప్పున లంచం డిమాండ్ చేశారు.

## టీ - సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం




హైదరాబాద్, మార్చి 24: టీ - సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయితీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, సిటీల నుండి అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీ-సేవ సెంటర్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. క్రొత్త పాన్ కార్డులు అప్లై, కరెక్షన్ చేయవచ్చు, బస్సు, ట్రైన్, విమానాల టికెట్స్ బుకింగ్స్, బ్యాంకు మనీ ట్రాన్స్ ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఎటిఎం సేవలు, కాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్ అండ్ కార్ ఇన్సురెన్సెస్, బిల్లుల చెల్లింపులు, 1000 కి పైగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్ లైన్ శిక్షణా తరగతుల కు రిజిస్ట్రేషన్, 500 కి పైగా స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్ కొరకు రిజిస్ట్రేషన్, 100 కి పైగా ప్రభుత్వ పరీక్షలకై మాక్ టెస్ట్ ల కై రిజిస్ట్రేషన్ మొదలగు ఆన్లైన్ సేవలను వినియోగ దారులకు అందించడం తో పాటు ఆన్ లైన్ లో వివిధ సేవలను అందిచడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందే వీలుంది. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: ఞఞఞ.ంవఝశీఅశ్రీఱఅవ.ఱశీఎ
ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకునేందుకు చివరి తేదీ: ఏప్రిల్ 09. వివరాలకు ఫోన్: 8179955744 సంప్రదించాలని ఆయన సూచించారు.

## తెలంగాణలో బీసీ రక్షణ చట్టం తీసుకురండి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం




హైదరాబాద్,మార్చి 24: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వివక్ష, హింసల నుండి బీసీలను కాపాడేందుకు ఎస్సీ, ఎస్టీల చట్టం తరహాలో బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కాచిగూడలో మీడియాతో మాట్లాడుతూ సమాజంలో మెజారిటీగా ఉన్నప్పటికీ, బీసీ వర్గాలకు తగినంత చట్టపరమైన రక్షణ లేక సామాజిక వివక్ష, వేధింపులు, హింసను ఎదుర్కొంటూనే ఉన్నాయని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయమై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరిపి, ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీసీ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు సూర్యనారాయణ, జెల్లా నరేంద్ర, సునీల్, మరపంగు వెంకన్న, కర్నాటి లోకేష్. తదితరులు పాల్గొన్నారు.

# దోమల దాడితో నాగోల్ కంగారు”ప్రజల ఆగ్రహం, బీఎస్పీ ధర్నా హెచ్చరిక

**- బహుజన సమాజ్ పార్టీ నాయకుడు ముత్యాల విష్ణు వర్ధన్**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:-హైదరాబాద్, నాగోల్:ఎల్బీ నగర్ పరిధిలోని నాగోల్, మన్సూరాబాద్ డివిజన్లలో దోమల బెడద రోజురోజుకు పెరిగి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా రాక్ టౌన్ కాలనీలో పరిస్థితి అదుపు తప్పినట్లుగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఒకచోట నిలబడలేని స్థితి నెలకొంది. రాత్రి మాత్రమే కాకుండా ఉదయం వేళల్లో కూడా దోమల కాటుతో సతమతం అవుతున్నారు. ఇళ్లలో సాధారణ పనులు చేయడమే కాకుండా, బాత్రూం వినియోగం కూడా కష్టంగా మారిందని బాధితులు చెబుతున్నారు.ప్రాంతంలో ఫాగింగ్ కార్యక్రమం సరైన విధంగా నిర్వహించడంలేదని, జిహెచ్ఎంసిలో ఫిర్యాదు చేసిన ప్రభావం కనిపించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారిందని ఆరోపిస్తున్నారు. జిహెచ్ఎంసి సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోవడం లేదని, ఏసీ గదుల్లోనే ఉండి వాస్తవ పరిస్థితిని విస్మరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ సమస్యపై బహుజన సమాజ్ పార్టీ నాయకుడు ముత్యాల విష్ణు వర్ధన్ తీవ్రంగా స్పందించారు. నాగోల్, మన్సూరాబాద్ ప్రాంతాల్లోనే దోమల బెడద అధికంగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే జిహెచ్ఎంసి కార్యాలయం ముందు బీఎస్పీ తరపున భారీ ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు.దోమల నివారణకు తక్షణ చర్యలు తీసుకుని, సమర్థవంతమైన ఫాగింగ్ నిర్వహించి, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా 29న భారీ శాంతి ర్యాలీ

**- అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించండి: కోదండరాం**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 24:హైదరాబాద్: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు కొనసాగిస్తున్న యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలో ఆధిపత్యం కోసం, చమురు వనరులపై పెత్తనం కోసం జరుగుతున్న ఈ యుద్ధం అమానుషమని విమర్శించారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సరైన విధానాన్ని అవలంబించలేదని ఆరోపించారు. ఈ యుద్ధ ప్రభావంతో దేశంలో గ్యాస్ కొరత తలెత్తిందని, పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రజల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయులు, అందులో 15 లక్షల మంది తెలంగాణ వాసులు తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 29న యుద్ధ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు నిర్వహించే శాంతి ర్యాలీకి పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోదండరాం పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దార సత్యం, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు భద్రగామ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం




హనుమకొండ మార్చి.24 : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగం ఊసలేదు జాబ్ క్యాలెండర్ జాడలేదు ప్రభుత్వం మొద్దు నిద్ర వహిస్తుంది. కాకతీయ యూనివర్సిటీ రజాక విద్యార్థి సంఘం ఇన్చార్జి కూరపల్లి రాజేష్. రాష్ట్రంలో అసెంబ్లీ .సమావేశాలు ప్రారంభమైన ప్రజల సమస్యలు రాష్ట్ర అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చ జరగాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తున్నారు నిరుద్యోగ యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉద్యోగ నియమకాలపై స్పష్టమైన చర్చ జరగకపోవడం బాధాకరమని కోరపల్లి రాజేష్ అన్నారు .తెలంగాణలో వేలాదిమంది నిరుద్యోగుల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్నారు. అవసరమైన ఉద్యోగం నోటిఫికేషన్లు విడుదల చేయడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తుంది యువతను నిరాశ పెంచుతుంది ఎంతో కష్టపడి చదువుకుంటూ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని లేకుంటే అతి త్వరలో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత అంతా ఏకమై అసెంబ్లీ ముట్టడించే అవకాశాలు ఉన్నాయని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు
ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రజాకా విద్యార్థి సంఘం ఇన్చార్జి కోరపల్లి రాజేష్ తో పాటు రజాక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు


## డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఉన్నతాధికారుల పాత్రపై విచారణ జరపాలి

**- ఆర్‌పీఐ (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్**



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఏలూరు :డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో న్యాయం జరగకుండా, నిజాలు వెలుగులోకి రాకుండా వ్యవహరించిన ఉన్నత పోలీసు అధికారులపై కూడా సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.ఈ కేసులో అప్పటి ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ను రక్షించేందుకు నిర్విరామంగా కృషి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు, ఏలూరు డి.ఐ.జి పాల్ రాజ్, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె. వి. రాజేంద్రనాథ్ రెడ్డి గార్ల పాత్రపై నిష్పక్షపాత దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.
డా. పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ, ఈ హత్య కేసు సందర్భంగా సేకరించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీలలో కొన్ని మాయంచేసినట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఆ ఫుటేజీలను ఉద్దేశపూర్వకంగా తొలగించిన లేదా సమర్పించకుండా దాచిపెట్టిన వారిని గుర్తించి, వారి పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సాక్ష్యాలను చెరిపివేయడం న్యాయ ప్రక్రియను దెబ్బతీసే ఘోర నేరమని ఆయన అన్నారు.అలాగే, ఈ కేసు సమయంలో జిల్లా ఎస్పీ మరియు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పలు దఫాలు సమావేశం అయినట్లు సమాచారం ఉందని, ఆ సమావేశాల పూర్తి వివరాలు --- తేదీలు, చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు --- ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశాలు దర్యాప్తుపై ఎలాంటి ప్రభావం చూ పాయో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
అదేవిధంగా, ఈ వ్యవహారంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా కూడా డీజీపీ, డి.ఐ.జి, జిల్లా ఎస్పీల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు పోలీసు వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుతత ఎంత ముఖ్యమో స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టించినా, లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఎంత పెద్ద అధికారులైనా చట్టం ముందు సమానమేనని డా. పిట్టా వరప్రసాద్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (ాxు) లేదా కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) తమ పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన హెచ్చరించారు.

## ఒంటెల నానోబాడీలతో డెంగ్యూకు చికిత్స.. కనుగొన్న శాస్త్రవేత్తలు..



దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగ్యూ ఒకటి. ప్రతి ఏడాది లక్షలాది మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. ఔశీతీశ్రీస నముశ్రీష్ట్ర ాతీస్త్రుఝఅఱఓ్ఞఱశీఅ ప్రకారం ఇటీవల దశాబ్దాల్లో డెంగ్యూ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో డెంగ్యూ నివారణకు మెరుగైన చికిత్సలు, టీకాలు అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు తీవ్రంగా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి సమయంలో పరిశోధకులు డెంగ్యూ వ్యాధి నివారణలో ఒక కొత్త ఆశాకిరణాన్ని కనుగొన్నారు. ఒంటెల శరీరంలో ఉత్పత్తి అయ్యే ప్రత్యేక యాంటీబాడీలు, అంటే నానోబాడీలు డెంగ్యూ వైరస్‌ను నిరోధించే సామర్థ్యం కలిగి ఉన్నాయని వారి అధ్యయనం సూచిస్తోంది. భవిష్యత్తులో ఈ నానోబాడీలు చికిత్సలు, టీకాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అవకాశముంది. ఒంటెల యాంటీబాడీలు మనుషుల యాంటీబాడీలతో పోలిస్తే నిర్మాణ పరంగా భిన్నంగా ఉంటాయి. ఇవి చాలా చిన్న పరిమాణంలో ఉండటంతో పాటు అధిక స్థిరత్వాన్ని కలిగి ఉంటాయి. ఈ కారణంగా సాధారణ యాంటీబాడీలు చేరలేని వైరస్ భాగాలను కూడా ఇవి లక్ష్యంగా చేసుకోవచ్చు. జీవశాస్త్రంలో అసాధారణ వ్యవస్థలను అధ్యయనం చేయడం ద్వారా వైద్యరంగంలో కొత్త మార్గాలు తెరుచుకుంటాయని ఈ పరిశోధన మరోసారి రుజువు చేసింది.ఇన్‌ఫెక్షన్ మార్గాలను అడ్డుకునే సామర్థ్యం..ఒంటెల నుంచి పొందిన నానోబాడీలు డెంగ్యూ వైరస్ నాలుగు ప్రధాన రకాలపై ప్రభావవంతంగా పనిచేస్తాయని గుర్తించారు. ఇది డెంగ్యూ టీకా అభివృద్ధిలో ఒక పెద్ద సవాలుగా ఉన్న అంశం కావడంతో ఈ పరిశోధనకు ప్రాధాన్యత పెరిగిందని చెప్పవచ్చు. డెంగ్యూ వైరస్ నాలుగు వేర్వేరు రకాలుగా ఉండటం వల్ల ఒక రకానికి వచ్చిన రోగనిరోధక శక్తి మరో రకానికి పనిచేయదు. ఈ కారణంగా సమగ్ర రక్షణ కలిగిన టీకా తయారు చేయడం ఇప్పటివరకు కష్టంగా మారింది. అయితే ఒంటెల నానోబాడీలు వైరస్ ప్రోటీన్లకు బలంగా కట్టుబడి, ఇన్ఫెక్షన్ మార్గాలను అడ్డుకునే సామర్థ్యం చూపించడం ఆశాజనకంగా భావిస్తున్నారు. సాధారణ యాంటీబాడీలకు భిన్నంగా ఒంటెలు హెవీ-చైన్ యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తాయి. వీటి యాంటీజెన్‌ను గుర్తించే భాగాన్ని నానోబాడీ అంటారు. ఇవి చిన్న పరిమాణం, అధిక స్థిరత్వం, కఠిన పరిస్థితుల్లో కూడా పనిచేసే లక్షణాలు కలిగి ఉండటం వల్ల వైద్య పరిశోధనలో ఎంతో విలువైనవిగా భావిస్తున్నారు. డెంగ్యూ వ్యాధి ప్రధానంగా ఈడెస్ ఈజిప్టి దోమల ద్వారా వ్యాపిస్తుంది. ఇది సాధారణ జ్వరంగా ప్రారంభమై, తీవ్రస్థాయిలో డెంగ్యూ హీమరాజిక్ ఫీవర్, డెంగ్యూ షాక్ సిండ్రోమ్ వంటి ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 390 మిలియన్ కేసులు నమోదవుతున్నాయి. వీటిలో దాదాపు 100 మిలియన్ కేసుల్లో లక్షణాలు కనిపిస్తాయి.యాంటీ వైరల్ చికిత్సలలో కీలక పాత్ర పోషించే అవకాశం..
ప్రస్తుతం డెంగ్యూ చికిత్స ప్రధానంగా లక్షణాల నియంత్రణపైనే ఆధారపడి ఉంది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# టికెట్ క్యాన్సిల్ చేస్తే పూర్తి డబ్బులు వెనక్కి : ఏప్రిల్ 1 నుండి కొత్త రూల్స్




న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే భారీ ఊరటనిచ్చింది. టికెట్ క్యాన్సిలేషన్, రిఫండ్ నిబంధనలలో కీలక మార్పులు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రయాణం రద్దయి నప్పుడు టికెట్ రద్దు చేసుకుంటే వచ్చే రిఫండ్ మొత్తాన్ని పెంచుతూ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 15 మధ్య దశలవారీగా అమలులోకి రానున్న ఈ నిబంధనలు, ప్రయాణికుల జేబుకు చిల్లు పడకుండా అండగా నిలవనున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం, రైలు బయల్దేరడానికి 72 గంటల కంటే ముందే కన్ఫార్మ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే, కేవలం నామమాత్రపు ఛార్జీలు మినహాయించి మిగిలిన పూర్తి మొత్తాన్ని రిఫండ్ చేస్తారు. గతంలో ఉన్న సంక్లిష్టమైన ఛార్జీల విధానానికి స్వస్తి పలుకుతూ, ముందస్తుగా ప్లాన్ మార్చుకునే వారికి ఇది పెద్ద ఊరటగా మారింది. 72 నుంచి 24 గంటల మధ్య: రైలు బయల్దేరడానికి 72 గంటల నుంచి ఒక రోజు ముందు వరకు టికెట్ రద్దు చేస్తే 'స్టాండర్డ్ పెనాల్టీ' కింద 25 శాతం కట్ చేసుకుని మిగిలిన 75 శాతం రిఫండ్ చేస్తారు. 24 నుంచి 8 గంటల మధ్య: ప్రయాణానికి 24 గంటల నుంచి 8 గంటల ముందు రద్దు చేసుకుంటే 'లేట్ క్యాన్సిలేషన్' కింద 50 శాతం మాత్రమే రిఫండ్ లభిస్తుంది. 8 గంటల లోపు: రైలు బయల్దేరడానికి 8 గంటల కంటే తక్కువ సమయం ఉంటే లేదా రైలు వెళ్ళిపోయిన తర్వాత రద్దు చేస్తే ఎలాంటి రిఫండ్ లభించదు. కేవలం రిఫండ్ మాత్రమే కాకుండా, బోర్డింగ్ పాయింట్ మార్చుకునే విషయంలోనూ రైల్వే శాఖ కనికరించింది. ఇప్పుడు ప్రయాణికులు రైలు బయల్దేరడానికి కేవలం 30 నిమిషాల ముందు వరకు కూడా తమ బోర్డింగ్ స్టేషన్‌ను మార్చుకోవచ్చు. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ వంటి పెద్ద నగరాల్లో ఒకటి కంటే ఎక్కువ స్టేషన్లు ఉన్నప్పుడు, ప్రయాణికులకు ఈ సౌకర్యం ఎంతో లాభదాయకం కానుంది. ప్రస్తుతం చార్ట్ తయారయ్యే లోపు మాత్రమే ఈ అవకాశం ఉండగా,

# పాత పగలు.. కొత్త పొత్తులు, తమిళనాట చిన్నమ్మ కొత్త వ్యూహం



తమిళనాడు: తమిళనాడు రాజకీయ యవనికపై మరో భారీ కుదుపు చోటుచేసుకుంది. అన్నాడీఎంకే మాజీ అధినేత్రి వీకే శశికళ, పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్. రామదాస్ చేతులు కలపడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాబోయే తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఈ ఇద్దరు సీనియర్ నాయకులు కొత్త రాజకీయ పొత్తును ప్రకటించారు. గత వారం తైలాపురం ఫామ్‌హౌస్‌లో జరిగిన రహస్య భేటీ అనంతరం ఈ 'డైనమిక్' కూటమి అధికారికంగా తెరపైకి వచ్చింది. శశికళ ఇటీవల స్థాపించిన 'ఆల్ ఇండియా పురట్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కళగం' రామదాస్ నేతృత్వంలోని పీఎంకే వర్గం కలిసి ఎన్నికల బరిలోకి దిగనున్నాయి. "తమిళనాడు ఆత్మగౌరవాన్ని కాపాడటం, ద్రోహం చిహ్నాలను తుడిచిపెట్టడమే మా లక్ష్యం" అని ఈ కూటమి సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మరియు తన మేనల్లుడు టీటీవీ దినకరన్‌లను లక్ష్యంగా చేసుకుని శశికళ ఈ వ్యూహాన్ని రచించినట్లు స్పష్టమవుతోంది. దక్షిణ తమిళనాడులో పట్టున్న 'థేవార్' సామాజిక వర్గానికి శశికళ ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఉత్తరాన 'వన్నియార్' ఓట్లు రామదాస్ వెంటే ఉన్నాయి. అయితే, థేవార్ ఓట్లు ఇప్పుడు దినకరన్ , ఓ పన్నీర్‌సెల్వం (ఐవీఖ కూటమి) మరియు శశికళ మధ్య చీలిపోయే అవకాశం ఉంది. మరోవైపు, రామదాస్ తన కుమారుడు అన్బుమణి రామదాస్‌తో విభేదాల కారణంగా వన్నియార్ ఓట్లు కూడా రెండుగా చీలుతున్నాయి. ఈ పరిణామం ముఖ్యంగా బీజేపీ నేతృత్వంలోని తలనొప్పిగా మారింది.

# కశ్మీర్ వేర్పాటువాది అసియా అంద్రాబీకి జీవిత ఖైదు



న్యూఢిల్లీ: కశ్మీర్ వేర్పాటువాది, దుఖ్తరాన్-ఇ-మిల్లత్ చీఫ్ అసియా అంద్రాబీ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఢిల్లీ కోర్టు జీవిత ఖైదు విధించింది. శిక్షపై వాదనల అనంతరం అడిషనల్ సెషన్స్ జడ్జి చందర్ జిత్ సింగ్ మంగళవారంనాడు తీర్పు వెలువరించారు. ఈ కేసులో ఇద్దరు సహ నిందితులు సోఫీ ఫమీదా, నహిదా నస్రీన్‌లకు కోర్టు 30 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. దేశానికి వ్యతిరేకంగా జనాలను రెచ్చగొడుతున్నారని, యుద్ధానికి ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలపై కేంద్ర హోం శాఖ ఆదేశాలతో 2018 ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్‌లో అసియా అంద్రాబీని 'ఉపా' చట్టం కింద అరెస్టు చేశారు. ఆమెతో కలిసి పనిచేస్తున్న అనుచరులు సోఫీ ఫమీదా, నహిదా నస్రీన్‌పై 2021లో కేసు నమోదైంది. ఈ ముగ్గురుని జనవరి 14న కోర్టు ముందు హాజరుపరచగా, ఉపా చట్టంలోని వివిధ సెక్షన్లతో పాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద వీరిని దోషులుగా కోర్టు గుర్తించింది. విచారణ సందర్భంగా అంద్రాబీకి కఠిన శిక్ష విధించాలని ఎన్‌ఐఏ వాదన వినిపించింది. ఆమె చర్యలు దేశంగా యుద్ధం ప్రకటించినట్టుగా ఉన్నాయని, జాతీయ భద్రతకు ముప్పు కలిగించే ఇలాంటి బెదిరింపు చర్యలపై కఠిన చర్చలు తీసుకోవడం ద్వారా గట్టి సందేశం ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో కోర్టు తాజా తీర్పు ఇచ్చిది.

# ముస్లింలకు పోటీగా మాధవీలత పూజలు



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ మహిళా నాయకురాలు కొంపెల్ల మాధవీ లత మరోసారి వార్తల్లో నిలిచారు. హిందూత్వ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, ముస్లిం నేతలపై సూటి విమర్శలు చేయడంలో ముందుండే మాధవీ లత.. ఈసారి ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఎయిర్ పోర్టులో పూజలు చేశారు. ఎయిర్ పోర్టులో మహిళలు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన రూమ్ లో కొందరు ముస్లిం మహిళలు నమాజ్ చేసుకుంటుండగా.. అక్కడికి వెళ్లి మాధవీలత పూజలు చేశారు.

"ఈ హడావిడి నడుమ ఒక ప్రశాంత క్షణం- భారత హృదయంలోని దైవానికి ప్రణామాలు. లోక కళ్యాణం (ప్రపంచ శ్రేయస్సు) సాధనలో, మొదట అంతరాత్మ సఖ్యతను సాధించాలి. ఢిల్లీ విమానాశ్రయం ప్రార్థనా మందిరంలో, నేను విశ్వమాత నుండి శక్తిని పొందుతూ, దుర్గా సూక్తంలోని దివ్య శ్లోకాలలో లీనమయ్యాను. మన గొప్ప దేశమైన భారత్, మన ప్రాచీన ఆరాధనా విలువలకు నిదర్శనంగా ఈ పుణ్యక్షేత్రాలను అంది స్తున్నప్పటికీ, వాటి శుద్ధి (పవిత్రత) బాధ్యత మనపైనే ఉంది. ఇవి సాధకుడికి, భక్తుడికి మరియు ప్రశాంత ఆత్మకు చెందిన ప్రదేశాలు. ఈ ప్రార్థనా మందిరాలలోని ప్రతి అంగుళాన్ని ఒక పుణ్యక్షేత్రంగా భావిద్దాం. అవి గాఢమైన నిశ్శబ్దానికి మరియు లోతైన ఆధ్యాత్మిక అనుబంధానికి నిలయాలుగా నిలవాలి" అంటూ మాధవీ లత ట్వీట్ చేశారు. దీనికి ఆ వీడియోను కూడా జత చేశారు.

మాధవీ లత వీడియో ఎక్స్ లో వైరల్ అవుతోంది. దీనిపై జనం రెండుగా విడిపోయారు. కొందరు ఆమె చర్యకు మద్దతు పలుకుతుండగా.... మరికొందరు మాత్రం మతసామరస్యాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల జాతీయ కోఆర్డినేటర్ మహమ్మద్ వసీం.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, మాజీ పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ట్యాగ్ చేస్తూ, "ప్రార్థన గది కేవలం నిశ్శబ్ద ప్రార్థనలు మరియు ధ్యానం కోసం మాత్రమే కాబట్టి దయచేసి చర్య తీసుకోండి.

# భూములకు ఉద్యోగం స్కామ్‌లో లాలూకు హైకోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: భూములు తీసుకుని ఉద్యోగా లిచ్చారనే ఆరోపణల కేసులో కేంద్ర రైల్వేశాఖ మాజీ మంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ చుక్కెదురైంది. ఈ కేసులో సీబీఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ ప్రసాద్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారంనాడు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని విచారణ సందర్భంగా కోర్టు పేర్కొంది. దీంతో లాలూకు ఎలాంటి ఉపశమనం దక్కలేదు. యథాప్రకారం కేసులో విచారణ కొనసాగనుంది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004-2009లో కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్-డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదిలీ చేశారని సీబీఐ ఆరోపణగా ఉంది. 2022 మే 18న లాలూ, నమోదైంది.

# ఎస్సీ రిజర్వేషన్లు రద్దు: సుప్రీంకోర్టు సంచలన తీర్పు



న్యూఢిల్లీ: భారత సర్వోన్నత న్యాయస్థానం రిజర్వేషన్ల అంశంపై ఒక చారిత్రాత్మక, సంచలన తీర్పును వెలువరించింది. షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు క్రైస్తవ మతంలోకి మారినట్లయితే, వారు తమ ఎస్సీ రిజర్వేషన్ హక్కులను కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధంగా లభించే ఈ ప్రయోజనాలు కేవలం హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని దళితులకు మాత్రమే పరిమితమని పేర్కొంటూ, గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎస్సీ రిజర్వేషన్లు అనేవి హిందూ సమాజంలోని అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక రుగ్మతల ఆధారంగా కల్పించబడ్డాయని, క్రైస్తవం వంటి మతాల్లో ఇవి ఉనికిలో లేనందున మత మార్పిడి తర్వాత ఆ హక్కులను క్లెయిమ్ చేయడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక నియామక ప్రక్రియకు సంబంధించి తలెత్తిన వివాదంపై ఏపీ హైకోర్టు గతంలో స్పందిస్తూ.. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ కోటా కింద ప్రయోజనాలు పొందలేరని తీర్పునిచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు, హైకోర్టు అంచనా సరైనదేనని ధృవీకరించింది. రాజ్యాంగంలోని 1950 నాటి ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను ఈ సందర్భంగా కోర్టు ఉటంకించింది.

# ప్రతీ ఇంటికీ రెండు ఫ్రీ గ్యాస్ సిలెండర్లుఇరాన్ వార్ వేళ సర్కార్ ఆఫర్




న్యూఢిల్లీ: ఇరాన్ వార్ ప్రభావంతో దేశవ్యాప్తంగా ఎల్పీజీ సిలెండర్లకు భారీ కొరత ఏర్పడింది. యుద్ధం నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు పెరిగి రేపు అస్సలు వంట చేసు కోవడానికి లేకుండా పోతాయన్న భయంతో ఎవరికి వారు సిలెండర్లు బ్లాక్ చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన కేంద్రం.. ఇప్పటికే పలు చర్యలు తీసు కుంటోంది. ఇదే క్రమంలో రాష్ట్రాలకు కూడా ఎల్పీజీ కొరత తీర్చేలా పలు ఆదేశాలు ఇస్తోంది. ఇదే క్రమంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఇవాళ 2026-27 సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు లక్షా 3 వేల కోట్లతో ఆదాయ, వ్యయాలతో రూపొందించిన ఈ బడ్జెట్ లో పలు కీలక ప్రతిపాదనలు చేశా రు. భారీ మౌలిక సదుపాయాల ఏర్పాటుతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఇందులో ప్రాధా న్యత ఇచ్చారు. దేశ రాజధాని ఇప్పటివరకు చూసిన అతిపెద్ద బడ్జెట్లలో ఒకటి ఇది. అయితే ఇందులో సీఎం రేఖా గుప్తా గత ఆప్ ప్రభుత్వ 'ఉచితాల సంస్కృతి'ని తీవ్రంగా విమర్శించారు. అదే సమయంలో ఇంటింటికీ రెండు ఉచిత ఎల్పీజీ సిలిండర్ల పథకం కోసం బడ్జెట్‌లో రూ.260 కోట్లు కేటాయించారు. ఈ పథకం అమలులో భాగంగా హోలీ, సిలెండర్లు ఇవ్వబోతున్నారు.

# బెల్లంపల్లి సహాయ కార్మిక అధికారి కార్యాలయం పై ఏసీబీ అధికారుల దాడి



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్, ప్రతినిధి : తెలంగాణ రిపోర్టర్స్ ఇంచార్జి, దాచేపల్లి రవి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సహాయ కార్మిక అధికారి ఓ మహిళా వద్ద నుండి 30 వేలు లంచం తీసుకుంటుండగా బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుకన్యను పట్టుకున్న ఏసీబీ అధికారులు

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక




Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30, ROAD NO 2, MADHURA NAGAR, MANSURABAD, LBNAGAR R R DIST , TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 ,ROAD NO 2, MADHRA NAGAR, MANSURABAD ,LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876